## క్లుప్తంగా

### మంత్రికి ఆహ్వానం



ఆహ్వాన పత్రికను అందజేస్తున్న గజ్వేల్ గౌడ సంఘం నేతలు

గజ్వేల్: మంత్రి పొన్నం ప్రభాకర్‌ను శుక్రవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో గజ్వేల్ గౌడ సంఘం నేతలు కలిశారు. ఈనెల 18 నుంచి 21వ తేదీ వరకు గజ్వేల్‌లో నిర్వహించనున్న రేణుకా ఎల్లమ్మతల్లి ఆలయ వార్షికోత్సవానికి రావాలని ఆహ్వాన పత్రికను ఆలయ కమిటీ బాధ్యులు అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రాజాగౌడ్, జంగం రమేశ్‌గౌడ్, రాజుగౌడ్, గణేష్‌గౌడ్, ఆశోక్‌గౌడ్, స్వామి గౌడ్ పాల్గొన్నారు.

### విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న మైనార్టీ గురుకులాల పాఠశాల ఆర్‌ఎల్‌సీ బహుమతి

దుబ్బాక: 10వ తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు పేరు తేవాలని మైనార్టీ గురుకులాల ఆర్‌ఎల్‌సీ బహుమతి అన్నారు. శుక్రవారం దుబ్బాక మైనార్టీ గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. భోజనం మెనూ ప్రకారం ఇస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరీక్షలు దగ్గరపడుతున్నందున విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలన్నారు. ఆమె వెంట పాఠశాల ప్రిన్సిపాల్ విమలరెడ్డి, ఉపాధ్యాయులు హమీద్, షాదుల్ తదితరులున్నారు.

### ఘనంగా రథ సప్తమి



శ్రీ సరస్వతి శిశుమందిర్‌లో సూర్య నమస్కారాలు చేస్తున్న విద్యార్థులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలో శుక్రవారం రథసప్తమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. యోగా కేంద్రాలు, పాఠశాలల్లో రథసప్తమి సందర్భంగా సూర్యనమస్కారాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు తప్పవు

కోహెడరూరల్(హుస్నాబాద్): ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు తప్పవని హుస్నాబాద్ సీఐ కిరణ్ హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని తంగళ్లపల్లి గ్రామ శివారులోని మోయతుమ్మెద వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్‌లను కోహెడ ఎస్‌ఐ తిరుపతితో కలిసి పట్టుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ జిల్లా కమిషన్ ఆదేశాల మేరకు ఇసుక రవాణాపై నిఘా ఏర్పాటు చేశామన్నారు. అలాగే యువత పేకాట, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు.

**ఇసుక ట్రాక్టర్ పట్టివేత**

చేర్యాల(సిద్దిపేట): ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను శుక్రవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని ఆకునూరు గ్రామ శివారు వాగు నుంచి ఇసుకను రవాణా చేస్తున్నట్లు వచ్చిన పోలీసులకు విశ్వసనీయ సమాచారం వచ్చింది. గ్రామానికి చెందిన మంతపురి ప్రశాంత్ రవాణా చేస్తున్న ట్రాక్టర్ పట్టుకొని చేర్యాల పోలీసులకు అప్పగించారు.

### వాటర్ ప్లాంట్ ప్రారంభం



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఏకానందం

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని ఆకునూరు ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల దాహార్తిని తీర్చేందుకు ఉల్లెంగుల ట్రస్ట్ చైర్మన్ ఉల్లెంగుల ఏకానందం పాఠశాలలో ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కుమార్తె సుష్మస్వరాజ్ పుట్టినరోజును పురస్కరించుకుని పాఠశాలలో ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటుచేశామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు ఎల్లయ్య, సులోచన, ఎస్ఎంసీ చైర్మన్ దాను, ఎంపీటీసీ శ్రీధర్, యాదయ్య, ఆశోక్ తదితరులు పాల్గొన్నారు.

# నిర్మాణాలకు నిధుల కొరత

- మన ఊరు మన బడి పనుల్లో భవన నిర్మాణాలు
- పూర్తికాకపోవడంతో విద్యార్థులకు అవస్థలు
- ఒకే చోట తరగతుల నిర్వహణ
- నిర్మాణాలు పూర్తి చేయాలని డిమాండ్

గత ప్రభుత్వం శిథిలమైన పాఠశాలల భవనాలను కూల్చి నూతన నిర్మాణాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మన ఊరు మన బడి కింద నిధులు కూడా కేటాయించింది. అయితే నిర్మాణాలు సకాలంలో పూర్తికాలేదు. దీంతో ఆరుబయట తరగతులు నిర్వహించాల్సి వస్తోందని ఉపాధ్యాయులు వాపోతున్నారు. నిధుల కొరతతో నిలిచిపోయినట్లు సర్వత్రా చర్చించుకుంటున్నారు. కొత్త ప్రభుత్వం నిర్మాణాలు పూర్తయ్యేలా చొరవ చూపాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.



దుబ్బాకలో ఎంపీపీ పాఠశాల భవన నిర్మాణం



దుబ్బాకలోని బాలికల ప్రాథమిక పాఠశాల

దుబ్బాకరూరల్: శిథిలావస్థకు చేరిన పాఠశాలలను కూల్చి వాటి స్థానంలో నూతనంగా పాఠశాలల భవనాలను నిర్మించాలని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మన ఊరు.. మనబడి పేరిట పాఠశాలల నూతన భవన నిర్మాణాలు చేపట్టింది. నిర్మాణాలు చేపట్టి ఏడాది గడుస్తున్నా ఇంత వరకు ఒక్క భవనం పూర్తి కాలేదు. నిధుల కొరతతో పనులు నిలిచిపోయినట్లు తెలిసింది. భవనాలు పూర్తి కాకపోవడంతో కొన్ని పాఠశాలల్లో ఆరుబయటే తరగతులు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. వర్షాకాలంలో విద్యార్థులు నానా అవస్థలుపడుతున్నారు. దీంతో అన్ని తరగతులు ఒకే చోట నిర్వహించాల్సి వస్తోంది. పాత పాఠశాల భవనాలను కూల్చివేయడంతో కొన్ని పాఠశాలల విద్యార్థులను మరొక పాఠశాలలకు పంపిస్తున్నారు. మండలంలోని పద్మనాభునిపల్లి, ఆకారం, పోతారం గ్రామాల్లో మన ఊరు మనబడిలో చేపట్టిన భవనాల నిర్మాణాలు పూర్తయ్యాయి. హబ్సీపూర్, చీకోడ్, చెల్లాపూర్, ధర్మాజీపేట, దుబ్బాక బాలికల పాఠశాల, హరిజనవాడ, నంబర్–1 పాఠశాల, దుంపలపల్లి, లచ్చపేట, పెద్దగుండవెల్లి, పోతారెడ్డిపేట, తిమ్మాపూర్, అచ్చుమాయిపల్లి, అప్పనపల్లి, రఘోత్తంపల్లి, జెడ్పీహెచ్‌ఎస్ ధర్మాజీపేట, జెడ్పీహెచ్‌ఎస్ బాలికలు, జెడ్పీహెచ్‌ఎస్ దుంపలపల్లి, గంభీర్‌పూర్, పోతారెడ్డిపేట గ్రామాల్లో చేపట్టిన నిర్మాణాలు అసంపూర్తిగానే దర్శనమిస్తున్నాయి. గత ప్రభుత్వం మన ఊరు మన బడి ద్వారా నిధులు కేటాయించింది. అయితే ప్రస్తుత ప్రభుత్వం పాఠశాల భవనాల నిర్మాణాలపై నిధులు కేటాయిస్తుందా లేదా అనే దానిపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి నిధులు కేటాయిస్తే భవన నిర్మాణాలు పూర్తవుతాయి. వచ్చే జూన్ నాటికి నూతన భవనాల్లో తరగతులు నిర్వహణకు అవకాశముంటుంది. భవన నిర్మాణాలు పూర్తి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కూడా కోరుతున్నారు.

**నిలిచిన నిర్మాణ పనులు**

నిధుల కొరతతో మన ఊరు మన బడి పనులు నిలిచిపోయాయి. నిధులు విడుదల చేస్తే నిర్మాణాలు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం.

– రిజ్వాన్, పీఆర్ ఏఈ

**నిర్మాణాలు ఇంకా పూర్తి కాలేదు**



పాఠశాల భవన నిర్మాణాలు ఇంకా పూర్తి కాలేదు. భవనాలు పూర్తి కాక పోవడంతో తరగతుల నిర్వహణ ఇబ్బందిగా మారింది. వచ్చే జూన్ నాటికి నిర్మాణాలు పూర్తవుతాయని భావిస్తున్నాం. – ప్రభుదాస్, మండల విద్యాధికారి

# దుబ్బాక డివిజన్‌లో విలీనం చేయొద్దు

**మండల సభ ఏకగ్రీవ తీర్మానం**



మాట్లాడుతున్న ఎంపీపీ అనిత

రాయపోలు(దుబ్బాక): రాయపోలు మండలాన్ని నూతనంగా ఏర్పాటు చేయబోయే దుబ్బాక రెవెన్యూ డివిజన్‌లో విలీనం చేయకుండా గజ్వేల్‌లోనే కొనసాగించాలని రాయపోలు మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. శుక్రవారం ఎంపీపీ కల్లూరి అనిత ఆధ్వర్యంలో మండల సభ ఏర్పాటు చేశారు. సభలో ఆయా శాఖల అధికారులు నిధులు, వ్యయంపై, ప్రభుత్వ పథకాలపై చర్చించారు. అనంతరం పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడారు. రాయపోలు మండలం గజ్వేల్‌కు పది కిలోమీటర్ల దూరంలో ఉందని, దుబ్బాకలో కలిపితే 50 కిలోమీటర్లు దూరం పెరుగుతుందన్నారు. ప్రజలకు పాలనాసౌలభ్యం కల్పించాలని కోరుతుంటే, విలీన నిర్ణయం రాయపోలు మండల ప్రజలకు మాత్రం విరుద్ధంగా మారుతుందన్నారు. ఆరు నెలల క్రితం జరిగిన మండల సభలోనూ ఇదే తీర్మానం చేశామని, ఇప్పుడు కూడా ఇదే అంశంపై ఏకగ్రీవంగా తీర్మానం చేస్తున్నట్లు చెప్పారు. ప్రజల మనోభావాలు గౌరవించకుండా రాయపోలు మండలాన్ని దుబ్బాక రెవెన్యూ డివిజన్‌లో విలీనం చేస్తే ఆందోళనలు తప్పవన్నారు. సమావేశంలో ఎంపీపీ, జెడ్పీటీసీ యాదగిరి, ఎంపీడీఓ బాలయ్య, తహసీల్దార్ దివ్య తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే సతీష్‌పై పిటిషన్ కొట్టివేత

సాక్షి, హైదరాబాద్: హుస్నాబాద్ నుంచి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేగా 2018లో గెలుపొందిన వొడితల సతీష్ కుమార్‌పై దాఖలైన ఎలక్షన్ పిటిషన్‌ను హైకోర్టు డిస్మిస్ చేసింది. ఆయన ఎన్నికను సవాల్ చేస్తూ సీపీఐ నేత చాడ వెంకట్‌రెడ్డి దాఖలు చేసిన ఎన్నికల పిటిషన్‌ను కొట్టివేసింది. ఈమేరకు జస్టిస్ కె.లక్ష్మణ్ శుక్రవారం తీర్పు వెలువరించారు. సతీష్ కుమార్ దాఖలు చేసిన నామినేషన్ పత్రాల్లో అవిభక్త కుటుంబ ఆదాయ వివరాలను వెల్లడించలేదని పిటిషనర్ అభియోగం. దీనిపై సతీష్ తరపు సీనియర్ న్యాయవాది వై.రామారావు వాదిస్తూ, ఆ ఎన్నికల్లో సతీష్ కుమార్ మూడు సెట్ల నామినేషన్ల పత్రాలను సమర్పించారని, ఒక సెట్లో పూర్తి వివరాలు సమర్పించలేదని, ఇది కావాలని చేయలేదని, మూడో సెట్‌లో అన్ని వివరాలను పొందుపర్చారని చెప్పారు. ఈ వాదనల తర్వాత హైకోర్టు, కోర్టు కమిషనర్ ద్వారా వివరాలను తెప్పించుకుంది. సతీష్ కుమార్ ఎన్నికను రద్దు చేయాలన్న అభ్యర్థనకు ఏవిధమైన ఆధారాలు లేవని తీర్పులో పేర్కొంది.

## దరఖాస్తుల ఆహ్వానం

దుబ్బాకరూరల్: అక్బర్‌పేట భూంపల్లి మండలంలోని శ్రీకూడవెల్లి రామలింగేశ్వరస్వామి దేవస్థానం ఆలయ కమిటీ చైర్మన్ పదవీ కాలం ముగిసింది. దీంతో నూతన చైర్మన్‌ను ఎన్నుకునేందుకు దేవాదాయ ధర్మదాయ శాఖ ఆదేశాలు జారీ చేసిందని, చైర్మన్ పదవికి పోటీచేసే అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆలయ ఈఓ విశ్వనాథ శర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 20 రోజుల లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

## ఇంటి వద్దకే అమ్మవార్ల ప్రసాదం

హుస్నాబాద్: సమ్మక్క, సారలమ్మ జాతర మేడారం వెళ్లలేని భక్తులకు ఆర్టీసీ గొప్ప అవకాశం కల్పించినట్లు కరీంనగర్ ఆర్టీసీ ఏటీఎం సదాశివ్ ఒక ప్రకటనలో తెలిపారు. మేడారం వెళ్లలేని వారు ఇంటి నుంచి లేదా ఆర్టీసీ కార్గో కౌంటర్‌లో అమ్మవార్ల ప్రసాదం కోసం బుక్ చేసుకుంటే, బెల్లం, పసుపు కుంకుమ ప్రసాదం కోసం రూ.299 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

# నీటి సరఫరాకు ఓహెచ్‌ఆర్ ట్యాంక్



సమస్యలు తెలుసుకుంటున్న ఎస్ఈ శ్రీనివాసాచారి

హుస్నాబాద్‌రూరల్: ఇటీవల నిర్వహించిన ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో భాగంగా అడిషనల్ కలెక్టర్ గరిమా అగర్వాల్ హుస్నాబాద్ మండలం మహ్మదాపూర్ గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో తాగునీరు సరఫరా కావడంలేదని గ్రామస్తులు అడిషనల్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆమె ఆదేశం మేరకు శుక్రవారం గ్రామానికి మిషన్ భగీరథ ఎస్ఈ శ్రీనివాసచారి, ఈఈ గిరిధర్‌తో కలిసి సందర్శించారు. గ్రామస్తులతో మాట్లాడి తాగునీటి సమస్య తెలుసుకున్నారు. గ్రామ పంచాయతీ పరిధిలో 80 ఇళ్లకు తాగునీరు సరఫరా కావడం లేదని గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఆ ప్రదేశం ఎత్తుగా ఉండటంతో మిషన్ భగీరథ నీళ్లు పోవడంలేదని ఆ ఇళ్లకు తాగునీరు సరఫరా కోసం 40 వేల లీటర్ల సామర్థ్యంగల ఓహెచ్‌ఆర్ వాటర్ ట్యాంక్‌ను నిర్మాణ ప్రతిపాదనలు పంపిస్తున్నామని తెలిపారు. నిధులు మంజూరుకాగానే పనులు ప్రారంభించి గ్రామంలో తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అధికారుల వెంట ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రుహీన తష్కిన్, ఏఈ మమత, ఎంపీఓ సత్యనారాయణ ఉన్నారు.

## అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



మాట్లాడుతున్న శ్రీనివాస్‌గుప్తా

ములుగు(గజ్వేల్): అభివృద్ధి, సంక్షేమం దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని ములుగు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్‌గుప్తా అన్నారు. మండలంలోని వంటిమామిడిలో శుక్రవారం మాట్లాడారు. పేద, మధ్య తరగతి ప్రజల ఆర్థిక స్థితిగతులు, జీవన ప్రమాణాలను మెరుగు పరచడమే ప్రభుత్వ కర్తవ్యమన్నారు. అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో త్వరలో కాంగ్రెస్ పార్టీ జెండాలను ఎగుర వేయడంతో పాటు ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు.

## గజ్వేల్ తహసీల్దార్‌గా శ్రీనివాస్



శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రజాప్రతినిధులు

గజ్వేల్‌రూరల్: గజ్వేల్ మండల తహసీల్దార్‌గా శ్రీనివాస్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన బదిలీపై కొండపాక నుంచి వచ్చారు. జెడ్పీటీసీ మల్లేశం, మాజీ సర్పంచ్‌లు బాల్‌చంద్రం, లక్ష్మణ్, నాయకులు పాండు, చంద్రం శ్రీనివాస్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

## జగదేవ్‌పూర్ గాంధీకి నివాళి

జగదేవ్‌పూర్(గజ్వేల్): జగదేవ్‌పూర్ గాంధీగా పేరుగాంచిన జగదేవ్‌పూర్ మాజీ సర్పంచ్ నరసింహరామయ్య పంతులు 19వ వర్ధంతిని ఏఎన్నార్ పీపుల్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పీపుల్స్ ట్రస్ట్ ప్రతినిధి శశిధర్‌శర్మ మాట్లాడుతూ ప్రజల అభివృద్ధి కోసం నిరంతరం పనిచేసిన నేత నరసింహ రామయ్య పంతులని, ఆయన స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు బుద్ధ వెంకటయ్య, బుద్ధ మహేందర్, కొంపల్లి కరుణాకర్, నరసింహరామయ్య కుటుంబ సభ్యుడు చిదంబరరావు, బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, బీజేపీ నాయకులు, పీపుల్స్ ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## 19 నుంచి విగ్రహాల ప్రతిష్ఠ ఉత్సవాలు

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి శివారు పాపన్నపల్లె హనుమాన్ దేవాలయంలో ఈనెల 19వ తేదీ నుంచి ధ్వజస్తంభ, నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు నిర్వహించనున్నట్లు హనుమాన్ భక్త బృందం సభ్యులు శుక్రవారం తెలిపారు. 19న గ్రామ ప్రదక్షిణ, గణపతి పూజ, రక్షాబంధనం, అగ్ని ప్రతిష్ఠ, 20న స్థాపనా దేవతల పూజలు, హోమాలు, 21న నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠ, యంత్ర ప్రతిష్ఠ కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు.

# కేంద్ర విధానాలపై కన్నెర్ర



సిద్దిపేట పట్టణంలో నిరసన తెలుపుతున్న కార్మిక సంఘాల నాయకులు



గజ్వేల్‌లో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

సిద్దిపేటకమాన్: బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని కార్మిక సంఘాల నాయకులు ఆరోపించారు. కార్మిక, కర్షక, రైతు సంఘాల పిలుపుతో చేపట్టిన ఒక రోజు దేశవ్యాప్త సమ్మెలో భాగంగా సిద్దిపేటలో కార్మిక సంఘాల జేఏసీ, వాటి అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని హైస్కూల్ నుంచి మోడ్రన్ బస్టాండ్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ చౌరస్తా వద్ద బైఠాయించారు. ఈ సందర్భంగా కార్మిక నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు అప్పగించి పెట్టుబడిదారి వ్యవస్థను ప్రోత్సహిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన కొత్త చట్టాన్ని వెంటనే రద్దు చేయాలన్నారు.

**విద్యుత్ ప్రైవేటీకరణ వద్దు**

దుబ్బాక: కేంద్రం తెచ్చిన రైతు, కార్మిక వ్యతిరేక చట్టాలను వెంటనే రద్దు చేయాలని, విద్యుత్ ప్రైవేటీకరణ ఆలోచనను తక్షణమే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి గొడ్డుబర్ల భాస్కర్ డిమాండ్ చేశారు. దేశవ్యాప్త కార్మికుల సమ్మెలో భాగంగా శుక్రవారం దుబ్బాకలో సీఐటీయూ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు భాస్కర్, రంగయ్య, శ్రీనివాస్, రాజు, సుధాకర్, విజయ, భూలక్ష్మీ, శ్యామల, సాధిక్, జగదీష్, మల్లేశం, తదితరులున్నారు.

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యుత్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని జిల్లా విద్యుత్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా విద్యుత్ భవన్ ఎదుట విద్యుత్ ఉద్యోగులు లంచ్ అవర్‌లో కార్మికులు, రైతులు, రైతు కార్మికుల ఆందోళనలకు మద్దతుగా నిరసన తెలిపారు. 2022 విద్యుత్ సాధన చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

**సమస్యలు పరిష్కరించాలి**

గజ్వేల్: అఖిల భారత ఉద్యోగుల సమాఖ్య పిలుపు మేరకు శుక్రవారం టీఎన్‌జీఓల సంఘం గజ్వేల్ శాఖ అధ్యక్షుడు లింగం ఆధ్వర్యంలో ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్(ఐఓసీ) వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎఫ్‌ఆర్‌డీఏ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని, సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, ఆదాయపు పన్ను పరిమితిని రూ.5 నుంచి రూ.10 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీఎన్‌జీఓల సంఘం నాయకులు నాగభూషణం, జబీనా సుల్తానా, రాజశేఖర్‌రెడ్డి, ఈశ్వర్, భరత్, నరేష్, శ్రీకాంత్, వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

**నల్ల బ్యాడ్జీలతో నిరసన**

కొండపాక(గజ్వేల్): దేశ వ్యాప్త కార్మిక, రైతు సంఘాల సార్వత్రిక సమ్మెకు మద్దతుగా మండల పరిధిలోని దుద్దెడ హైస్కూల్లో శుక్రవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మీ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

హుస్నాబాద్: దేశ వ్యాప్త కార్మికుల సమ్మెలో భాగంగా తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట శుక్రవారం కార్మికులు ధర్నా నిర్వహించారు. కనీస వేతనం నిర్ణయించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.


**కేంద్రానికి గుణపాఠం తప్పదు**

కొండపాక(గజ్వేల్): కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు అమ్ముల బాల్‌నర్సయ్య శుక్రవారం హెచ్చరించారు. కార్మిక సమ్మెలో రైతు సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

**కార్మిక రంగానికి అండగా సీఐటీయూ**

గజ్వేల్‌రూరల్: కేంద్ర కార్పొరేట్ విధానానికి వ్యతిరేకంగా పోరాడుతూ, కార్మిక రంగానికి అండగా ఉంటామని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి శివలింగ కృష్ణ పేర్కొన్నారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా శుక్రవారం గజ్వేల్ పాత మున్సిపల్ కార్యాలయం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు కార్మికులతో కలిసి ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బండ్ల స్వామి, నాయకులు పాల్గొన్నార

## మృతదేహం వెలికితీత



పోస్టుమార్టం నిర్వహిస్తున్న వైద్యులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండల పరిధిలోని అంతాయగూడెం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ తీగుల్ల సత్యం సోదరుడు తీగుల్ల యాదగిరి(33) గత నెల 30వ తేదీన మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఎటువంటి ఫిర్యాదు చేయకపోవడంతో గ్రామస్తుల ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు. పది రోజులుగా యాదగిరిపై హత్యాయత్నం జరిగిందనే వార్తల నేపథ్యంలో మృతుడు యాదగిరి భార్య భాగ్యలక్ష్మీ తన భర్తను ఎవరో కావాలనే చంపారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. శుక్రవారం యాదగిరి మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిర్వహించినట్లు ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపారు.

## పోగొట్టుకున్న ఫోన్ అందజేత

సిద్దిపేటరూరల్: ఈనెల 8వ తేదీన దుబ్బాకకు చెందిన శివకుమార్ తన ఫోన్ ఇర్కోడ్ గ్రామంలో పోగొట్టుకున్నాడు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్ గుర్తించి, శుక్రవారం ఫిర్యాదుదారుడికి అందజేశారు. ఎవరైనా ఫోన్ పోగొట్టుకుంటే వెంటనే పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు.

## సంక్షిప్త వార్తలు

**◆ నేడు విద్యుత్ సరఫరా బంద్**

హుస్నాబాద్: హుస్నాబాద్‌లోని 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా 33 కేవీ కట్కూర్ ఫీడర్, 33 కేవీ వాటర్ గ్రిడ్ ఫీడర్, 33 కేవీ పోతారం ఫీడర్‌పై శనివారం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. మహ్మదాపూర్ వాటర్ గ్రిడ్ 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో, పోతారం, మీర్జాపూర్, కట్కూర్, తోటపల్లి సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

**◆ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి**

చిన్నకోడూరు(సిద్దిపేట): వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయని చిన్నకోడూరు ఎస్‌ఐ బాలకృష్ణ అన్నారు. శుక్రవారం చిన్నకోడూరులో వాహనదారులకు రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపరాదని, అతివేగంగా వాహనాలు నడిపి ప్రమాదాలకు గురికావొద్దన్నారు. ద్విచక్రవాహన దారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం నూతనంగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆయనను వాహనదారులు సన్మానించారు.

సిద్దిపేటజోన్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ట్రాఫిక్ సీఐ రామకృష్ణ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రతిభ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలు, మైనర్ డ్రైవింగ్, రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ఉండాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారికి జరిమానా విధిస్తామన్నారు.

**◆ విద్యార్థులకు సైన్స్ క్విజ్ పోటీలు**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): అలయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని జిల్లా పరిషత్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు శుక్రవారం సైన్స్ క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ గవర్నర్ సోమ వనజ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు పోటీలను నిర్వహించినట్లు చెప్పారు. పోటీల్లో 12,500ల మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు ఈ క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సర్టిఫికెట్లతోపాటు నగదు బహుమతిని త్వరలో అందించనున్నట్లు చెప్పారు.

**◆ మోడల్ స్కూల్ సందర్శన**

మిరుదొడ్డి(దుబ్బాక): మిరుదొడ్డి మోడల్ స్కూల్‌ను దుబ్బాక కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం సందర్శించారు. పాఠశాల సమస్యలను ప్రిన్సిపాల్ భారతీ దేవిని అడిగి తెలుసుకున్నారు. సమస్యలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

**◆ ఘనంగా రథయాత్ర**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రథసప్తమిని పురస్కరించుకొని శుక్రవారం పట్టణంలో శ్రీసూర్యభగవానుడి రథయాత్ర వైభవంగా నిర్వహించారు. శ్రీమోహినిపుర వెంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామిని ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అమరేష్‌విష్ణు, ఆలయ కార్యనిర్వహణ అధికారి విశ్వనాథ్ శర్మ, వికాస తరంగిణి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

**◆ మూఢనమ్మకాలను నమ్మొద్దు**



సిద్దిపేటరూరల్: మూఢ నమ్మకాలను నమ్మకుండా, ఆరోగ్య సమస్య ఉన్నవారు ఆసుపత్రిలో సంప్రదించాలని రూరల్ ఎస్‌ఐ అపూర్వరెడ్డి విద్యార్థులకు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని రాఘవాపూర్ కేజీబీవీలో మహిళల రక్షణ, మూఢ నమ్మకాలు, బాణామతి తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంద్రజాలికుడు నరేష్ మ్యాజిక్ షో ద్వారా బాలికలకు బాణామతిపై అవగాహన కల్పించారు.

**◆ విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ**

సిద్దిపేటరూరల్: నారాయణరావుపేట మండల పరిధి మాటిండ్ల ఆర్డీఎఫ్ పాఠశాలలో శుక్రవారం పదో తరగతి విద్యార్థులు స్వయం పాలన దినోత్సవం నిర్వహించారు. తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. విద్యాశాఖమంత్రిగా మధు, డీఈఓగా హారిక, ఎంఈఓగా రక్షిత, కరెస్పాండెంట్‌గా లహరి, ప్రిన్సిపాల్‌గా శ్రీక్షిత, అకడమిక్ కోఆర్డినేటర్‌గా మణిరాం సాయిలు వ్యవహరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ నర్సింగోజు విష్ణుమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.